క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొత్తపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి ఇన్విటేషన్ కార్క్ బాల్ క్రికెట్ పోటీలు

నాగులుప్పలపాడు: మద్దిరాలపాడు క్రికెట్ లీగ్, పాలడుగు వెంకట్రావు మెమోరియల్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి మద్దిరాలపాడు గ్రామంలో జిల్లా స్థాయి ఇన్విటేషన్ కార్క్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాలడుగు రాజీవ్, సందీప్ తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.60 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. క్రికెట్ పోటీలను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. ఉత్తరాయణం వైశాఖ మాసం, ఉత్తరాభాద్ర నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందెతీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

- రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది రైతులకు ఉపశమనం
- దాదాపు రూ.20వేల కోట్ల భూ విలువపై రైతులకు హక్కు
- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ మారెడ్డి సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న మారెడ్డి సుబ్బారెడ్డి

ఒంగోలు: దశాబ్దాల తరబడి చుక్కల భూముల సమస్యతో విలవిలలాడుతున్న రైతుల సమస్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ మారెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ హయాంలో కొన్ని భూములు ప్రైవేట్ లేదా ప్రభుత్వానివా అని నిర్ధారణకు చేయలేని పరిస్థితిలో వాటికి చుక్కలు పెట్టి వదిలివేశారన్నారు. దశాబ్దాలుగా రైతులు ఈ భూములను సాగుచేసుకుంటున్నా, స్వానుభవంలో ఉన్నా వాటిని అమ్ముకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వం ఈ భూములను రిజిస్ట్రేషన్ చట్టంలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. దీంతో రైతులు మరింత చిక్కుముడిని ఎదుర్కొన్నారని, ఈ నేపథ్యంలో వీటికి శాశ్వత పరిష్కారం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం దాదాపు లక్షల మంది రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపిందన్నారు. నెల్లూరు జిల్లాలో 43 వేల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 37 వేల ఎకరాలు, కడప జిల్లాలో 22 వేల ఎకరాలు వెరసి 1.02 లక్షల ఎకరాల చుక్కల భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో అవసరమైన మార్పులు చేసి రైతులకు సర్వహక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితా నుంచి తొలగించారన్నారు. ఈ నిషేధిత జాబితాలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ రూ.8వేల కోట్లు ఉంటే, బహిరంగ మార్కెట్ విలువ రూ.20 వేల కోట్లు ఉందన్నారు. నిషేధిత జాబితాలో ఉన్నందున ఈ భూముల క్రయ విక్రయాలు నిలిచిపోవడం, 2016లో ఒక మెమో ద్వారా చంద్రబాబు ప్రభుత్వం పుండు మీద కారం చల్లినట్లుగా 22ఏ జాబితాలో చేర్చడంతో అన్నదాతల జీవితాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఏదో ఒక దానిలో రైతు పేరు నమోదై ఉండడం, రైతు వద్ద పట్టాదారు పాసుపుస్తకం ఉండడం, రైతు వద్ద వంశపారంపర్య దస్తావేజులు లేదా రాసుకున్న అగ్రిమెంట్లు ఉండడం, రైతు 2017కు ముందు 12 ఏళ్లుగా ఆ భూమిని సాగుదారుగా ఉన్న దాఖలా చూపిస్తే భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతుకు పూర్తి హక్కుతో పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేస్తామని తెలిపారు. పేదల సాగుకు ఇచ్చిన బంజరు భూములు, అటవీ హక్కుల చట్టం ప్రకారం ఇచ్చిన భూములకు సైతం గత ప్రభుత్వం చుక్కల భూములుగా ప్రకటించిందన్నారు. అయితే ప్రస్తుతం ఈ భూములకు సైతం సర్వ హక్కులను రైతులు పొందనున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతిగా ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. రూ.3 వేల కోట్లతో రైతు సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు తాజాగా బడ్జెట్లో రూ.5వేల కోట్లు ప్రకటించారన్నారు. పొగాకు రైతు సంక్షోభంలో కూరుకుపోయి ఉంటే మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వమే రంగంలోకి దించి రూ.220 కోట్ల విలువైన పొగాకును కొనుగోలు చేసి మార్కెట్‌లో ధర పెరిగేటట్లు చూడడం, ఎగుమతులను ప్రోత్సహించిందన్నారు. ధాన్యం తడిచి రైతులు తీవ్ర నిరుత్సాహంలో ఉంటే ప్రభుత్వమే ధాన్యాన్ని మొత్తం కొనుగోలుచేసి 21రోజులలో చెల్లించాల్సిన మొత్తాన్ని కేవల 5 రోజులలోనే రూ.447 కోట్లు చెల్లించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. తాజాగా చుక్కల భూముల సమస్యను పరిష్కరించి దాదాపు లక్షమంది రైతుల హృదయాల్లో నిలిచారని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



సబ్ సెంటర్‌లో రోగులను పరీక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి సూచించారు. ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వలేటివారిపాలెం సబ్ సెంటర్‌లో 104 వాహనం ద్వారా సోమవారం వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ హెల్త్ కాన్సెప్ట్ వినూత్నమైందని, ఒక్కో రోజు ఒక్కో గ్రామాన్ని సందర్శించి వైద్యసేవలు అందించడం ద్వారా ఆ గ్రామంలోని ప్రజలు వైద్యం కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం ఉండదని అన్నారు. ప్రజలు వడగాడ్పుల ప్రభావం తగ్గేంత వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జయలక్ష్మి, వైద్యారోగ్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రణాళికలు



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: వేసవిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రణాళికలు రూపొందించామని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో నగరపాలక సంస్థ అధికారులతో క్లాప్‌పై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కలెక్టర్ దినేష్‌కుమార్ వేసవిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారన్నారు. అందులో భాగంగా మురుగు కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. నగరంలోని 70 వార్డు సచివాలయాల పరిధిలో 70 మంది నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. వారికి కేటాయించిన సచివాలయాల పరిధిలో మురుగు కాలువల్లో పూడిక తీసే కార్యక్రమాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. వేసవిలో రూపొందించిన ప్రణాళికలను కలెక్టర్ రివ్యూకు కూడా పంపడం జరుగుతుందన్నారు. ప్రణాళికలో భాగంగా ఎక్కడైనా మిషనరీ, పారిశుధ్య కార్మికులు అవసరం ఉంటే వెంటనే ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాలకు తెలియజేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రానున్న 30 రోజుల్లో ఒంగోలు నగర పరిధిలో ప్రతి మురుగు కాలువలో పూడికతీయాలని ఆదేశించారు. ప్రతిరోజూ పారిశుధ్య కార్మికుల హాజరు వెరిఫికేషన్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. క్లాప్ యూజర్ చార్జీలు కలెక్షన్స్ గురించి నోడల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత రెండు నెలలతో పోల్చుకుంటే ఈ నెలలో యూజర్ చార్జీల వసూలులో పురోగతి కనిపించిందని వెల్లడించారు. ఇదే విధంగా ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్, ఎంఈ కే మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చీమకుర్తి: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో చీమకుర్తిలో సోమవారం ఆ పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల సుబ్బారావు, దాసరి రవి, మద్ది వెంకటేశ్వరరావు, చలపతిరావు, ఏడుకొండలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ నాయకులు సోమవారం డీఈవో రమేష్‌ను ఆయన చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్‌సీఎం యాజమాన్యాలలో పనిచేస్తున్న 44 మంది ఉపాధ్యాయ సిబ్బందికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, ప్రభుత్వంలో విలీనమైన ఉపాధ్యాయులందరికీ పీఎఫ్, ఏపీజీఎల్ఐ కోసం జెడ్పీ సీఈవోకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని కోరారు. హనుమంతునిపాడు మండలం ఈదరవారిపల్లి ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, విద్యార్థులు లేని పాఠశాలల్లో పనిచేసే ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలను డైరెక్టర్ కార్యాలయానికి పంపాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి, ఆర్థిక కార్యదర్శి కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికల ఎస్‌ఓపీపై అవగాహన పెంచుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్)పై సంబంధిత అధికారులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎస్‌ఓపీపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న జరిగే వీడియో సమావేశంలో ఇవ్వాల్సిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్, మెటీరియల్ సరఫరా, ఎన్నికలకు 48 గంటల ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిస్పాచ్ తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఎన్నికల సిబ్బంది నిర్వహించాల్సిన విధులపై పలు సూచనలు చేశారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, ఎలక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

18న పవర్‌లిఫ్టింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: పవర్‌లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ జిల్లా క్రీడాకారుల ఎంపిక స్థానిక భారత జాతీయ వ్యాయామ కళాశాలలో ఈనెల 18న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి భక్తధృవుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బాలబాలికలు ఇరువురూ పాల్గొనవచ్చన్నారు. మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ ఎంపిక ఉంటుందన్నారు. ఎంపికైన వారు ఈనెల 20, 21 తేదీల్లో తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, మాస్టర్స్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. మాస్టర్స్ విభాగంలో 40 సంవత్సరాలు పైబడిన వారు, సబ్ జూనియర్ విభాగంలో 18 సంవత్సరాలలోపు, జూనియర్స్ విభాగంలో 23 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. ఆసక్తిగలవారు వయస్సు ధ్రువీకరణ పత్రం(ఆధార్)తో ఈనెల 18న నేరుగా ఎంపికకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 8142555000 లేదా 9885721140 ను సంప్రదించాలన్నారు.

కారుణ్య నియామకపత్రం అందజేత



నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: విధి నిర్వహణలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటరమణ కుటుంబానికి ఎస్పీ మలికాగర్గ్ అండగా నిలిచారు. చీరాల వన్‌టౌన్ పీఎస్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించగా ఆయన కుమార్తె సుభాషిణికి కారుణ్య నియామకం కింద జిల్లా పోలీసు ట్రైనింగ్ కాలేజీలో టైపిస్టుగా ఉద్యోగ నియామకపత్రం అందించారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్ కుటుంబసభ్యుల యోగక్షేమాలను తెలుసుకొని ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చని, జిల్లా పోలీసుశాఖ అండగా ఉంటుందని అభయం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు పరిపాలనాధికారి సులోచన తదితరులు పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమం మనందరి కర్తవ్యం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంచికంటి, తదితరులు

ఒంగోలు: మరో గ్రంథాలయ ఉద్యమం మనందరి కర్తవ్యమని మంచికంటి అన్నారు. స్థానిక స్థానిక ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న మంచి పుస్తకం గ్రంథాలయంలో మరో గ్రంథాలయ ఉద్యమ కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష మృతభాష కాకూడదని, పిల్లలు మొబైల్స్ పట్టుకోవడం కాదని, పుస్తకాలు పట్టుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మన సాహిత్య వారసత్వాన్ని మన తర్వాతి తరాలకు అందజేయాల్సిన ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. పిల్లలపై సాంకేతికత చూపుతున్న విధ్వంసాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ హాస్టళ్లను మెరుగుపరచాలని, అనాథ బాలల సదనాలను అభివృద్ధి చేయాలని, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతనే నినాదంతో మరో గ్రంథాలయ ఉద్యమాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కొర్రపాటి సుధాకర్, నవ్యాంధ్ర రచయితల సంఘ అధ్యక్షురాలు టి.అరుణ, నవలా రచయిత సాగర్, శ్రీరామ కవచం, నూతకోటి శరత్, కొణిజేడు ఎడ్యుకేషన్ సొసైటీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం



మంటలార్పుతున్న ఫైరింజిన్, స్థానికులు

చీమకుర్తి: మండలంలోని పాటిమీదపాలెం గ్రామానికి చెందిన మూలె రమణారెడ్డి వరిగడ్డి వామి ఆదివారం దగ్ధమైంది. 14 ఎకరాల్లో సాగుచేసి కోత కోసుకుని ఇంటికి తెచ్చుకున్న వరిగడ్డిని వామిగా ఏర్పాటు చేసుకున్నాడు. కరెంటు తీగ తెగి వామిపై పడటంతో వామి దగ్ధమైనట్లు రమణారెడ్డి తెలిపారు. దాని విలువ సుమారు రూ.3.50 లక్షల వరకు ఉంటుందన్నారు. స్థానిక రైతులు మోటార్లతో పైపుల ద్వారా వరిగడ్డి వామి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా నియంత్రించింది.

నేరస్తులకు ఊతమివ్వడం దారుణం

- బీజేపీ పాలకులపై మహిళా నాయకులు ధ్వజం



కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా నాయకులు

ఒంగోలు: నేరస్తులకు బీజేపీ పాలకులు ఊతమిస్తున్నారంటూ ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి విమర్శించారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతుగా స్థానిక రంగారాయుడు చెరువుకట్టపై వాకింగ్‌కు వచ్చిన వారి వద్ద నుంచి సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను, హర్యానా క్రీడాశాఖామంత్రి సందీప్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం గత 23 రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న దీక్షలకు ప్రతిఒక్కరూ సంఘీభావం ప్రకటించాలని కోరారు. దేశానికి స్వర్ణ పతకాలు సాధించి పెట్టిన మహిళా క్రీడాకారిణులు తమపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని బజారున పడాల్సిన దుస్థితిని పాలకులు కల్పించారన్నారు. ప్రపంచ దేశలలో భారత క్రీడా ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్న అగ్రశ్రేణి రెజ్లింగ్ క్రీడాకారులు సాక్షి మాలిక్, వినేష్ ఫొఘాట్, బజరంగ్ పూనియా తదితర క్రీడాకారులు గత జనవరిలో క్రీడా పోటీలకు ఎంపిక కావాలంటే తాము కోరినవన్నీ చేయాలని రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, మరికొంతమంది లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడుతున్నట్లు ప్రభుత్వ అధికారులు, క్రీడా మంత్రికి బాధితులు తెలియజేశారన్నారు. విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకుంటామని చెబుతూనే అధికార యంత్రాంగం దోషులకు మద్దతుగా వ్యవహరించడం, బెదిరింపులకు పాల్పడటం జరిగిందన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే సిగ్గువిడిచి మహిళా క్రీడాకారులు నిరసన ఉద్యమంలోకి రావాల్సిన పరిస్థితిని ప్రభుత్వమే కల్పించిందన్నారు. బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్ 41 క్రిమినల్ కేసుల్లో ఉన్నాడని, అతనితో పెట్టుకుంటే అంతు చూస్తాడని, ఉద్యమాన్ని విరమించుకుని ఇంటికి పొండని పాలకులు మాట్లాడుతుండటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, నాయకురాళ్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ఎంసెట్ పరీక్షలు ప్రారంభం



ఎంసెట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పరీక్షకు హాజరైన విద్యార్థులను పకడ్బందీగా తనిఖీ చేసిన అనంతరం కేంద్రాల్లోకి అనుమతించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

- సాక్షి, ఒంగోలు



ద్విచక్ర వాహనం దగ్ధం

మార్టూరు: మెడికల్ షాపులకు మందులు సరఫరా చేసే ఓ వ్యక్తి బైకు మార్గమధ్యంలో దగ్ధమైంది. ఈఘటన మండలంలోని వలపర్ల గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. చిలకలూరిపేటకు చెందిన మద్ది శేఖర్ ఓ హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీ తరపున పరిసర గ్రామాల్లోని మెడికల్ షాపులకు మందులు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం శేఖర్ తన బైక్ మీద వలపర్ల వెళ్తున్నాడు. స్థానిక పెట్రోలు బంకు సమీపంలో సైలెన్సర్ వేడికి బ్యాగులో మంటలు అంటుకొని ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. శేఖర్ బైకును వదిలి దూరంగా వెళ్లాడు. మంటల ధాటికి మందులు బ్యాగుతో సహా బైకు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. మొత్తం రూ.1 లక్ష మేర వాటిల్లినట్లు బాధితుడు శేఖర్ వాపోయాడు.



మంటల్లో దగ్ధమవుతున్న బైకు